క్లుప్తంగా

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్

తుక్కుగూడ : ఎన్నికల ప్రచారంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించే బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ ఆ పార్టీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కానున్నారని చెప్పారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి గెలుపు కోసం సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలన్నారు.

ఘనంగా పల్లవి వార్షికోత్సవ వేడుకలు



బహుమతులు అందచేస్తున్న కొమురయ్య

బడంగ్‌పేట్: పల్లవి మాడల్ స్కూల్ అల్వాల్‌లో రెండు రోజుల పాటు 8వ వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూళ్ల చైర్మన్ మల్కా కొమురయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే విజయాలు సొంతం చేసుకోవచ్చని చెప్పారు. నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీఈఓ యశస్వి, డైరెక్టర్ సుధ, కిశోరి ధత్రక్, అనురాధారెడ్డి, కల్పనా రమేష్, ప్రధానోపాధ్యాయులు సునీర్ నాగి, వైస్ ప్రిన్సిపాల్ విద్యారావు, కోఆర్డినేటర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



108 అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

కందుకూరు: 108 వాహనంలో ఓ మహిళ ప్రసవించింది. ఈ ఘటన కందుకూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. కందుకూరు గ్రామానికి చెందిన గర్భిణీ అనూషకు పురిటి నొప్పులు రావడంతో బుధవారం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. మొదటి కాన్పు కావడంతో అక్కడి వైద్య సిబ్బంది హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో 108 వాహనంలో ఆమెను హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మగ శిశువును ప్రసవించింది. వారిద్దరికి ప్రథమ చికిత్స అందించి పేట్లబురుజులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ కల్యాణ్, పైలెట్ అప్సర్ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

కందుకూరు: గుడుంబాతయారీ కేసులో బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించారు. ఈ ఘటన మహేశ్వరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ వీణా తెలిపిన వివరాలు.. మండలంలోని మురళీనగర్‌కు చెందిన వాంక్డావత్ హర్య గుడుంబా తయారు చేస్తూ సెప్టెంబర్ 26న ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని నుంచి 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని హెచ్చరించి వదిలేశారు. కాగా, మళ్లీ గుడుంబా తయారు చేస్తుండటంతో బుధ వారం కందుకూరు తహసీల్దార్ గోపాల్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. దీంతో అతనికి రూ.50 వేలు జరిమానా విధించారు. గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

అయ్యప్ప మాలధారణ ప్రారంభం



మాలధారణలో అయ్యప్ప భక్తులు.

పహాడీషరీఫ్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మామిడిపల్లిలోని బాల మణికంఠ అయ్యప్ప దేవస్థానంలో బుధవారం మాలధారణ చేశారు. గురుస్వాములు మద్ది జగదీశ్వర్‌రెడ్డి, ప్రసాద్ గురుస్వాముల పర్యవేక్షణలో 52 మంది తెల్లవారు జామున మాలవేసుకున్నారు. 41 రోజుల పాటు వీరంతా నియమనిష్టలతో దీక్షను చేపట్టనున్నారు. ప్రతి ఏటా మాలధారణ వేసే వారి సంఖ్య పెరుగుతుందని జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి తెలిపారు.



బడంగ్‌పేట్: ఆత్మీయ ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న సబితారెడ్డి

కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

- అధికారంలోకి రాగానే నగరానికి నలువైపులా మెట్రో విస్తరణ
- అభివృద్ధే గెలిపిస్తుంది
- మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే కారుగుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో నూతనంగా ప్రభుత్వ పాఠశాల, పాలిటెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, క్రీడామైదానం, ఉచిత ఫంక్షన్ హాల్, కొత్త మున్సిపల్ కార్పొరేషన్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బట్టేల్‌గుట్ట అభివృద్ధి, పార్కుల సుందరీకరణ, రోడ్ల వెడల్పు, వరదల శాశ్వత నివారణకు ఎస్ఎన్‌డీపీ ట్రంక్ లైన్ నిర్మాణంతో పాటు కాలనీల్లో సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీ, లైట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీల వల్ల ఎలాంటి మేలు జరగదన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి మరోమారు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మంత్రి సబితారెడ్డికి ప్రజలు బ్రహ్మరథం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన రోడ్ షోకు మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. ఈ రోడ్ షో మున్సిపల్ కార్యాలయం, చౌడీ, ఇంద్రాహిల్స్, భగత్‌సింగ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2 మీదుగా సాగింది. సబితారెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ విశ్వనగరంగా మారుతుందన్నారు. సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్లకు 5 వేల డబుల్ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతం మీదుగా ఉన్న మెట్రోను అధికారంలోకి వచ్చిన వెంటనే నగరానికి నలువైపులా విస్తరింపజేయనున్నట్లు చెప్పారు.

జనాభాకు అనుగుణంగా సదుపాయాలు

కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, రహదారుల నిర్వహణ, పచ్చదనం నర్సరీల ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారం, పబ్లిక్ టాయిలెట్ల కోసం అవసరమైన స్థలాల గుర్తింపు వంటి చర్యలను చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నం చేస్తుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌యాదవ్, అనిత , బాలకిషన్, కొండల్‌రెడ్డి, అశోక్, అంకిరెడ్డి, రుషిగుప్తా, రాఘవేందర్ గుప్తా, సుదామా తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన మహిళలు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీరామకృష్ణపురం కాలనీలో మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి మద్దతుగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు అరవింద్‌శర్మ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అరవింద్‌శర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలు కోరుకుంటున్నారని, ఇవన్నీ బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్‌కు విశేష స్పందన లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో విద్యారెడ్డి, ప్రమీల, రమాదేవి, లలితాదేవి, రాధ, కల్పన, జ్యోతి, సుజాత, స్వప్న, రమ్య, రమా, గోపాల్‌రెడ్డి, హరీశ్, శ్యామ్ సుందర్, సాయికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న కేఎల్లార్ సతీమణి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సునామీలో బీఆర్ఎస్ గల్లంతవుతుందని మహేశ్వరం నియోజకవర్గ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచెన్నగారి లక్ష్మారెడ్డి సతీమణి విజయలక్ష్మి వ్యాఖ్యానించారు. బుధవారం ప్రచారంలో భాగంగా ఆర్కేపురంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలతో మహిళకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ప్రజాసేవా చేసేందుకు వచ్చిన కేఎల్లార్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు తమలపాకుల హర్షలత, నాయకులు సోనీ, స్వర్ణ, శిరీష చౌదరి, బాలమణి, నిర్మలారెడ్డి, విజయ, ప్రియాంక ఉన్నారు.

25న రేవంత్‌రెడ్డి రోడ్ షో

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి మద్దతుగా ఈనెల 25న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రోడ్ షో కార్యక్రమం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. 25న సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు రోడ్డు షో తుర్కయంజాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

అందెల గెలుపును ఎవరూ ఆపలేరు



కందుకూరు: శ్రీరాములుకు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గూడూరులో ప్రచారం చేస్తున్న అందెల

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పెద్దమ్మ తండా, నల్ల చెర్వు తండాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది గ్రామ సర్పంచ్ నీలా మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో నర్సింహారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. మహేశ్వరం మండలంలోని మన్సాన్‌పల్లి, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాల్లో నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూంలు స్థానికులకు ఇవ్వకుండా పాతబస్తీకి చెందిన ఎంఐఎం కార్యకర్తలకు మంత్రి సబితారెడ్డి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. దళితబంధు పథకం అర్హులకు ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అనుచరులకే ఇచ్చారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు, తండాలు అభివృద్ధికి అమడదూరంలో ఉన్నాయన్నారు. సర్పంచ్‌లు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలూ ఉన్నాయి. మహేశ్వరంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన అన్నారు. బీజేపీలో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు నేనావత్ రవినాయక్, గన్యానాయక్, దేవులానాయక్, దేవ్‌సింగ్‌నాయక్, బాబు నాయక్, రాజీ, దేవులనాయక్ పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి చంద్రయ్య గౌడ్, రాష్ట్ర బీజేవైఎం ప్రచార కార్యదర్శి కాత్రావత్ మోహన్ నాయక్, సర్పంచ్‌లు శంకర్, రఘుపతి గౌడ్, సురేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



మహేశ్వరం: బీజేపీలో చేరుతున్న పెద్దమ్మతండా బీఆర్ఎస్ నాయకులు

భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటాం..

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటామని బీజేపీ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని 16 గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో రైతుల భూములను మంత్రి సబితారెడ్డి లాక్కున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో నీళ్ల కంటే మద్యం ఎక్కువగా దొరుకుతుందని విమర్శించారు. మళ్లీ బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే రేషన్, పింఛన్, దళిత, బీసీబంధు పథకాలు రద్దు చేస్తారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వకుండా తెలంగాణ సమాజాన్ని సీఎం కేసీఆర్ వంచిస్తున్నారన్నారు. ఆర్టీసీ, కరెంట్ చార్జీలు పెంచినా, గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకున్నా మంత్రి సబితారెడ్డి నోరు మెదపలేదని విమర్శించారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో బీజేపీకే ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సీనియర్ నాయకులు సత్తయ్య, ఎంపీపీ జ్యోతిపాండు, సర్పంచులు మల్లారెడ్డి, వసంతకృష్ణగౌడ్, ప్రభాకర్, ఎంపీటీసీలు ఎస్.ఎల్లారెడ్డి, మల్లేశ్, రేఖాబాబురావు, వి.బాల్‌రాజు, నాయకులు పాండు, హరిబాబు, బీజేవైఎం మండల అధ్యక్షుడు లింగంయాదవ్, జిల్లా నాయకుడు దిలీప్‌గౌడ్ పాల్గొన్నారు.



కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రమేష్

రాత్రి కాంగ్రెస్.. ఉదయం బీఆర్ఎస్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 39వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకులు మాదరి సురేఖ రమేష్ దంపతులు సొంత గూటికి చేరారు. మంగళవారం రాత్రి కాంగ్రెస్ మహేశ్వరం అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో సురేఖరమేష్ దంపతులు హస్తం పార్టీలో చేరారు. కాగా, బుధవారం ఉదయం తిరిగి యువనాయకులు కౌశిక్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు కామేష్‌రెడ్డిల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం గమనార్హం. నియోజకవర్గాన్ని విధాలా అభివృద్ధి చేసిన సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా పని చేస్తానని వారు తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఇబ్రహీంపట్నం: పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, ఆపరేట్ విధానం, మాక్ ఓటింగ్ నిర్వహణ, వీవీపాట్ స్లిప్‌లు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఓటింగ్ పూర్తైన అనంతరం ఏవీఎంల సీలింగ్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు వస్తే సంబంధిత ఉన్నతాధికారులకు, టెక్నికల్ సిబ్బందికి వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

కల్తీ ఆహారంతో అనారోగ్యం



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: కల్తీ ఆహారంతో అనారోగ్య సమస్యలు వస్తాయని, కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాపులు ఎంతో అవసరమని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రభు అభిప్రాయపడ్డారు. డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగ కన్వీనర్లు డా. రజిత, డా. మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ.. నేడు ఆహార పదార్థాలన్నీ కల్తీమయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు కల్తీ ఆహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాలలో ప్రత్యేక సదస్సును నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పోవాలే.. కాంగ్రెస్ రావాలే

- పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ అరాచక పాలన పోయి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారంఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ, పోచారం, మెటిల్లా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరణి పోర్టల్ తెచ్చి సామాన్యులను కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి నేటికి ఇవ్వలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మూడు పర్యాయాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పిన.. స్థానిక ప్రజాప్రతినిధి అవినీతికి పాల్పడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. చేయి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేశ్, మడుపు వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి , ప్రభాకర్‌రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్, చిన్నా , శ్రీశైలం పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

హయత్‌నగర్: గంజాయి, మద్యం, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారంఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి సరూర్‌నగర్ క్లస్టర్ పరిధిలోని హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, కందుకూరు, ఆమనగల్ల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు రూ.6. 81 కోట్ల విలువైన మద్యం, గంజాయి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, ఇప్పటి వరకు 290 కేసులు నమోదు చేశామని, 142 మందిని అరెస్టు చేశామని వివరించారు.

అన్ని కులాల సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం

- అన్ని బీసీ కుల సంఘాలకు కార్పొరేషన్లు ఏర్పాటు
- లిక్కర్ షాపుల్లో గౌడలకు వాటా
- కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ

వనస్థలిపురం: అన్ని బీసీ కుల సంఘాలకు కార్పొరేషన్లు ఏర్పాటుతో పాటు లిక్కర్ షాపుల్లో గౌడ కులస్తులకు వాటా పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, అన్ని కులాల సమ్మిళిత అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. ప్రతి కులానికి పనిముట్ల కోసం రూ. 10 లక్షలు, బీసీ సబ్ ప్లాన్ కింద రూ. 20 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కందికంటి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రచార కమిటీ కో–కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, నాయకులు స్వతిన్‌గౌడ్, చిరంజీవి పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమావేశంలో..

లింగోజిగూడ డివిజన్ కామేశ్వరరావు కాలనీలో ఖాజా భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం మైనార్టీల సమావేశంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ అనేది అన్ని మతాలు, ప్రజలందరి భవిష్యత్ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ బంధు అంటూ మోసం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వివాహానికి రూ. 1,70,000, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 10 లక్షల ఆరోగ్య బీమా అందజేస్తామన్నారు. ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రచార కమిటీ కో–కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, శాలిని పాల్గొన్నారు.



మేరు సంఘం సమావేశంలో పాల్గొన్న మధుయాష్కీ గౌడ్

మేరు బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో..

కులవృత్తులపై ఆధారపడి బతికే పరిస్థితులు ప్రస్తుతం లేవని, కులవృత్తులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని మధుయాష్కీ గౌడ్ అన్నారు. బుధవారం మేరు బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. మేరు కులస్తుల ఫెడరేషన్ ఏర్పాటుకు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. నాయకులు మునిగాల రాము, మంజులా రెడ్డి, నిర్మలారెడ్డి, మేరు కులస్తులు పాల్గొన్నారు.